ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -63 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 22 జూన్ 2026

# యోగాతో హెల్దీ ఆంధ్ర



## బాబా రామ్‌దేవ్‌తో కలిసి చంద్రబాబు, లోకేశ్ యోగాభ్యాసం



**రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా యోగా సాధన**

**రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామని సీఎం ప్రకటన**

**ఆగస్టు 15 నుంచి 'సంజీవని' ప్రాజెక్ట్ అమలు**

**స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత యోగా మందిరాల నిర్మాణం**

**అమరావతిజూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు**మిగతా 2లో...**



# శారీరక ఫ్లెక్సిబిలిటీ మన లక్ష్యం కావాలి

**కోల్‌కతాలోని చారిత్రక రెడ్ రోడ్ వేదికగా జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించిన మోదీ**

**ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక థీమ్‌తో వేడుకలు**

**210 భారతీయ రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో 2,500 యోగా ప్రదర్శనలు**

**కోల్‌కతాజూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం (జూన్ 21, 2026) అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఏడాది భారతదేశపు ప్రధాన జాతీయ వేడుకకు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రక 'రెడ్ రోడ్' వేదికైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సభకు స్వయంగా హాజరై, **మిగతా 2లో...**



# సాయికృష్ణ కేసు.. దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

**విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ పోలీస్ కస్టడీలో మృతి చెందినట్టు ఆరోపణలు**

**సిట్ ఏర్పాటు చేసిన పోలీస్ డిపార్ట్ మెంట్**

**ఐజీ రవి ప్రకాశ్ నేతృత్వంలో దర్యాప్తునకు ప్రభుత్వ ఆదేశం**

**సస్పెండైన సీఐ నాగరాజుపై హత్య, ఆధారాల ధ్వంసం ఆరోపణలు**

**సీఎం ఆదేశాలతో వేగవంతమైన దర్యాప్తు, సీఐ నాగరాజు విచారణ**

**విజయవాడజూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడి కస్టడీ మృతి ఆరోపణల కేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అదృశ్యం, కస్టడీ మృతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది.**మిగతా 2లో...**

# ప్రశాంతంగా నీట్ రీ టెస్ట్



**5400కు పైగా కేంద్రాల్లో నిర్వహణ**

**హైదరాబాద్ లోనూ తరలివచ్చిన అభ్యర్థులు**

**న్యూఢిల్లీ : జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** నీట్ యూజీ 2026 రీ టెస్ట్ ఆదివారం దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగింది. దేశంలోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాల్లోనూ, విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ ఈ రీ టెస్టును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. ఈ పరీక్షకు 22.79 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్ లీక్ కారణంగా మే 3న జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.**మిగతా 2లో...**

# రేవంత్ ఢిల్లీ టూర్

**పలువురు కేంద్ర మంత్రులతో భేటీలు**

**పార్టీ అగ్రనేతలనూ కలిసే అవకాశం**



**న్యూఢిల్లీ జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రాభివృద్ధి, పలు కీలక ప్రాజెక్ట్ అనుమతులే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయనున్నారు. శనివారం ముంబయిలో జరిగిన ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా సాయంత్రం ఏడు గంటలకు ఢిల్లీ చేరుకున్నారు. నేడు, రేపు(22, 23 తేదిల్లో) సీఎం ఢిల్లీలోనే ఉండనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం**మిగతా 2లో...**

# తమిళనాడులో ఘోరం

**సీఫుడ్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్ -ఏడుగురు మహిళల మృతి,**

**తొమ్మిదిమంది పరిస్థితి విషమం**

**విచారణకు సీఎం విజయ్ ఆదేశం**




**చెన్నై: జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడులోని సీఫుడ్ ఫ్యాక్టరీలో ఘోరం జరిగింది. తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలో ఉన్న ఒక ప్రయి వేట్ సీఫుడ్ ఎగుమతి యూనిట్‌లో ఆదివారం అమ్మోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు మహిళలు ప్రాణాలు**మిగతా 2లో...**



# చర్చలు షురూ

**స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్, పాక్, ఖతార్ నేతలు తుది శాంతి ఒప్పందం కోసం కసరత్తు**

**ఇరాన్ అణు కార్యక్రమం, లెబనాన్‌లో కాల్పుల విరమణ సహా అపరిష్కృతంగా ఉన్న కీలక అంశాలపై నిర్ణయం**

**జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** మధ్యప్రాచ్యంలో యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలికేందుకు ఉద్దేశించిన తుది ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరాన్, అమెరికా ప్రతినిధులు ఆదివారం స్విట్జర్లాండ్‌లో చర్చలు ప్రారంభించారు. ఇరాన్ అణు కార్యక్రమం, లెబనాన్‌లో కాల్పుల విరమణ సహా అపరిష్కృ తంగా ఉన్న కీలక అంశాలపై ఈ సందర్భంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారు.**మిగతా 2లో...**

# రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

**సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం**

**ప్రభుత్వ విజయాలను, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించడమే లక్ష్యం**

**గతంలో విడుదల చేసిన 7 శ్వేతపత్రాల తరహాలోనే ఈ నివేదికల రూపకల్పన**

**రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు ఎలా నడిపించామో స్పష్టం చేయాలని సూచన**

**అసత్య ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం**

**అమరావతిజూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు 'ప్రోగ్రెస్ రిపోర్ట్స్' విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు



అధికారులను, మంత్రులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఎలా అభివృద్ధి పథంలోకి నడిపించారో ఈ నివేదికల ద్వారా ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు.
**మిగతా 2లో...**

# తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తుంది: కెటిఆర్

**హైదరాబాద్ జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో ప్రభుత్వం లేదని ఒక మాఫియా రాజ్యం నడుస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. అందినంత దోచుకో.. దొరికిన కాడికి దాచుకో అనే స్కీము నడుస్తుందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దండుపాళ్యం బ్యాచ్‌కి రేవంత్ రెడ్డి గుంపు మేస్త్రీగా ఉన్నారని, అందుకే అటు రేవంత్ రెడ్డితో పాటు ప్రతి ఒక్క మంత్రి కాంగ్రెస్ నాయకులు అందిన కాడికి దోచుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు గుండాయిజాన్ని ప్రతి



# యోగాతో హెల్దీ ఆంధ్ర

**మొదటిపేజీ తరువాయి**

ప్రశాంత వాతావరణంలో బాబా రామ్‌దేవ్‌తో కలిసి యోగా చేయడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన గుర్తింపు తెచ్చి, నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 190 దేశాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మోదీ తన చొరవతో ప్రపంచానికి భారతదేశ శక్తులను చాటుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలబెడుతున్నారని కొనియాడారు. సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు ముడిపడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ (సుఖీభవ ఏపీ) సాధ్యమవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో విశాఖపట్నంలో 'యోగాంధ్ర-2025' పేరిట భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ బుక్, ప్రపంచ రికార్డులను సృష్టించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా వేడుకలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని, ఈ సంస్కృతిని ఇంటింటికీ చేర్చి ప్రజారోగ్యాన్ని కాపాడటమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో బాబా రామ్‌దేవ్ చేసిన అమోఘమైన కృషిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. రాష్ట్రంలో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తామని, స్టాండర్డ్ యోగా ప్రోటోకాల్స్ రూపొందించడానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం 'యోగాంధ్ర' పేరిట ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను కూడా తీసుకురానున్నారు. అలాగే, రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌లను పూర్తిగా దూరంగా పెట్టాలని, రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్యాలను దరిచేరనివ్వకుండా చూసుకోవచ్చని హితవు పలికారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని (గ్రీన్ కవర్) 50 శాతానికి పెంచుతామని చెబుతూ.. రాబోయే ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు యోగాను కూడా అందులో భాగం చేస్తామన్నారు.

## తమిళనాడులో ఘోరం

**మొదటిపేజీ తరువాయి**

కోల్పోయారు. మరో తొమ్మిదిమంది పరిస్థితి విషమంగా ఉంది. 40 మందికి పైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పెరియపాళయం సమీపంలోని కన్నిగైపైర్ వద్ద ఉన్న 'సెయింట్ పీటర్స్ పాల్ సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రయి వేట్ లిమిటెడ్'లో ఈ లీకేజీ జరిగింది. ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వారిలో అత్యధికులు మహిళలే. అసోం, ఒడిశా, జార్ఖండ్‌లకు చెందిన సుమారు 120 మంది వలస కార్మికులు ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి అమ్మోనియా లీక్ మొదలై, వేగంగా ప్రాంగణంలోని నివాస ప్రాంతానికి వ్యాపించింది. వారాంతపు సెలవు కావడంతో తమ గదుల్లోనే ఉన్న చాలా మంది కార్మికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడగా, కొందరికి నోరు, ముక్కు నుంచి రక్తం కారడం వంటి సమస్యలు తలెత్తాయి.



# సాయికృష్ణ కేసు.. దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి**

శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం. రవి ప్రకాశ్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు.

ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక, ఫోరెన్సిక్ సహకారాన్ని పోలీస్ శాఖలోని వివిధ విభాగాల నుంచి తీసుకునేందుకు సిట్‌కు పూర్తి అధికారాలు కల్పించారు.

ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సస్పెండెడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నాగరాజు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమ నిర్బంధం, హత్య, సాక్ష్యాల ధ్వంసం వంటి ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేయనుంది. మృతుడు సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 19న సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్లు 127(4), 127(6), 103(1), 238 కింద కేసు నమోదు చేశారు. సింగ్ నగర్‌లోని ఆయన నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

### అసలేం జరిగింది?

విచారణ పేరుతో మే 9న తన కుమారుడిని పోలీసులు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి రాలేదని తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురి చేసి, కొట్టి చంపేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా, జూన్ 15న సాయి కృష్ణను కోర్టులో హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు విఫలం కావడంతో గడువును జూన్ 29కి పొడిగించింది.

ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 17న సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు బృందాలు ఇప్పటికే విజయలక్ష్మి, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీని, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాయి. సాయికృష్ణను చంపి దహనం చేశారని తల్లి ఆరోపించిన నేపథ్యంలో కృష్ణలంకలోని శ్మశానవాటికలో మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన అనాథ శవాల రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని, సాయి కృష్ణ, అతని తల్లి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది.

# రేవంత్ ఢిల్లీ టూర్

**మొదటిపేజీ తరువాయి**

వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగాఢ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్, పీయూష్ గోయల్, ఇతర మంత్రుల అపాయింట్మెంట్ కోరినట్టు సమాచారం.రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ

ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాత్ సింగ్‌తో సీఎం భేటీ కానున్నట్టు తెలిసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవన ప్రాజెక్ట్ అభివృద్ధి పనులకు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని బాపూఘాట్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడానికి కావాల్సిన 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ' కోసం 83 ఎకరాల భూము లు ఇవ్వడానికి రక్షణ శాఖ అంగీకారం తెలిపింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధి లోని రూ. 533 కోట్ల విలువైన భూములు బదలాయింపునకు ఆమోదం తెలిపిం ది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి సీఎం కృతజ్ఞతలు తెలపనున్నారు. అలాగే సికింద్రాబాద్ ఫ్లైఓవర్ నిర్మాణాలకు కంటోన్మెంట్ భూముల అప్పగింత, సైనిక్ స్కూల్, ఇతర రక్షణ భూముల బదలాయింపు అంశాలపై మరోసారి విజ్ఞప్తి చేయనున్నట్టు సమాచారం.

రైతు సమస్యలపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో చర్చలు

అభివృద్ధితో పాటు రైతులు ఎదుర్కొంటోన్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ముఖ్యంగా పారా బాయిల్డ్ బియ్యం, ధాన్యం ఉత్పత్తి, బకాయిల విడుదల అంశంపై కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి భేటీ కానున్నట్టు సమాచారం. గత పర్యటనలో భాగంగా పారాబాయిల్డ్ బియ్యాన్ని సేకరించాలని సీఎం కోరారు. అలాగే ఈసారి భారీ దిగుబడి నేపథ్యంలో అంచనాకు మించిన సేకరణ, రాష్ట్రం లో బియ్యం సేకరణలో కలుగుతోన్న ఇబ్బందులపై చర్చించనున్నారు. దీంతో పాటు పాఠశాలలు, హాస్టళ్లు, ఐసీడీఎస్ కేంద్రాల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ (ఎఫ్ఆర్‌కే) పంపిణీని పునరుద్ధరించాలని కోరనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

**రైల్వే మంత్రితో భేటీ..**

వీటితో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ విస్తరణ, దానికి సంబంధించిన నిధుల సమీకరణపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. మెట్రో ప్రాజెక్టు కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం పొందే అంశంపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్మెంట్ కోరినట్టు తెలిసింది. ఈ భేటీలోఢ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పురోగతికి సహకరించాలని కోరనున్నారు. అయితేఢ కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 22 లేదా 23వ తేదీల్లో ఢిల్లీలో ఉంటాననీ.. రైల్వే మంత్రితో సమయం ఖరారు చేయిస్తే, ఇద్దరం కలిసి వెళ్లి తెలంగాణకు అత్యంత కీలకమైన ఈ అంశాలపై చర్చిద్దామని లేఖలో స్పష్టం చేశారు. మెట్రో రైల్ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని కోరుతూ ఈ నెల 18నే అన్ని వివరాలతో కూడిన లేఖను పంపినట్టు సీఎం గుర్తుచేశారు. కాగాఢ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ఒప్పంద పత్రాలు, అనుబంధ డాక్యుమెంట్లు, వాస్తవ రికార్డులతో ఢిల్లీలో ఉండాలని సీఎం అధికారులను ఆదేశించినట్టు సమాచారం. అలాగే కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అపాయింట్‌మెంట్‌ను సీఎంఓ కోరినట్టు తెలిసింది. జహీరాబాద్ ఇండస్ట్రియల్, వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్, హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. వీరితో పాటు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర మంత్రుల సమయం కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

# రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వ పాలనపై ఏడు అంశాల్లో శ్వేతపత్రాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, విద్యుత్, శాంతిభద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ వంటి అంశాలపై వాస్తవ పరిస్థితులను ఆ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచారు.

ఇప్పుడు ఆ శ్వేతపత్రాలకు కొనసాగింపుగా ఈ 'ప్రోగ్రెస్ రిపోర్ట్స్' ఉండాలని సీఎం సూచించారు. వివిధ శాఖల్లో వచ్చిన మార్పులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను సమగ్రంగా ఇందులో పొందుపరచాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అసత్య ప్రచారాలను (ఫేక్ న్యూస్) తిప్పికొట్టేందుకు, వాస్తవాలను ప్రజల ముందు ఉంచి రాష్ట్రాన్ని ఎలా గాడిన పెట్టారో స్పష్టంగా తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నివేదికల ద్వారా రెండేళ్ల ప్రభుత్వ పనితీరును ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ప్రశాంతంగా నీట్ రీ టెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో ఆదివారం నీట్ పరీక్షను మరోసారి నిర్వహించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్ష జరిగింది. అయితే వికలాంగ అభ్యర్థులకు సాయంత్రం 6:20 గంటల వరకు పరీక్ష రాయడానికి అనుమతించారు. ఈ పరీక్షను ఇంగ్లీష్‌తో సహా 12 భారతీయ భాషలలో నిర్వహించారు. ఎన్టీఏ అధికారుల సమాచారం ప్రకారం 95,000కు పైగా పరీక్షా గదులలో మొత్తం 1,38,560 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని జాతీయ, రాష్ట్ర, మంత్రిత్వ శాఖల స్థాయిలో వర్చువల్‌గా పర్యవేక్షిస్తున్నామని ఎన్టీఏ అధికారులు తెలిపారు. అలాగే 51,311 జామర్‌లను అందుబాటులో ఉంచినట్టు కూడా చెప్పారు. పరీక్ష సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా కేంద్రాల వద్ద డ్రోన్‌లను, అదనపు సిబ్బందిని మోహరించారు. దేశ రాజధానితో సహా అనేక రాష్ట్రాల్లో, పరీక్షా కేంద్రాల వెలుపల వేచి ఉన్న తల్లిదండ్రులు, సంరక్షకుల కోసం ఉచిత తాగునీరు, అల్పాహారం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దేశరాజధాని ఓఖ్లాలోని ఎన్టీఏ ప్రధాన కార్యాలయం నుంచి పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. "పరీక్షను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం" అని విద్యా మంత్రిత్వ శాఖ తెలిపింది. కొంత మంది అభ్యర్థులు, అభ్యర్థుల తల్లిదండ్రులతో ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. తమ సమస్యలను వారు మంత్రికి తెలియచేశారు.

## తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తుంది: కెటిఆర్

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ కనుసన్నల్లోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ప్రైవేట్ వారికి రాసిచ్చిన విషయాన్ని కెటిఆర్ గుర్తుచేశారు

స్వయంగా ముఖ్యమంత్రే ప్రతి ఒక్కరినీ బెదిరిస్తూ మంత్రులు పారిశ్రామికవేత్తల తలలకు తుపాకులు పెడుతూ డబ్బులు ఇస్తారా చస్తారా అని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. రెండున్నర సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో ఒక్క ఇల్లు కూడా కట్టని కాంగ్రెస్ పార్టీ వేలాది ఇండ్లను కూల్చేందుకు మాత్రం సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఉన్న సిటీని వదిలిపెట్టి సిఎం తాను కబ్జా చేసిన వేలాది ఎకరాలను కాపాడుకోవడం కోసమే ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తన భూములు చూసుకోవడానికే ఉనికిలో లేని ఫ్యూచర్ సిటీకి అప్పుడప్పుడు వెళ్లి వస్తున్నారని ఆరోపించారు. రాజేంద్రనగర్ స్థానిక ఎంఎల్ఎ అభివృద్ధి పేరుతో పార్టీ మారారని.. కానీ, ఈ రెండున్నర సంవత్సరాలలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా..? అని కెటిఆర్ ప్రశ్నించారు. ఎంతమంది పెద్ద నేతలు పోయినా గులాబీ సైన్యం బలంగా అలాగే ఉన్నదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కెసిఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా తీసుకువచ్చి గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెటిఆర్ పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కెటిఆర్ దిశానిర్దేశం చేశారు.

# శారీరక ఫ్లెక్సిబిలిటీ మన లక్ష్యం కావాలి

**మొదటిపేజీ తరువాయి**

వేలాది మంది ఉత్సాహవంతులైన ప్రతినిధులు, సాధారణ ప్రజలతో కలిసి సామూహిక యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక నినాదంతో (థీమ్) నిర్వహించారు. వయసుతో సంబంధం లేకుండా శారీరక చలనశీలత, మానసిక ప్రశాంతత, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ప్రధాని నొక్కిచెప్పారు.రెడ్ రోడ్‌పై ఏర్పాటు చేసిన భారీ బహిరంగ వేదిక నుంచి మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. యోగా అనేది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని అనుసంధానించే ఒక గొప్ప సామూహిక శక్తిగా ఎదిగిందని కొనియాడారు. "మనం 20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి కంటే 40 ఏళ్ల వయసు వచ్చేసరికి మరింత శారీరక ఫ్లెక్సిబిలిటీని సాధించడమే మన లక్ష్యం కావాలి" అని పిలుపునిచ్చారు. కోల్‌కతా నగరం ఈ ప్రధాన జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడంతో, నగరవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ వేడుకల సన్నాహకంగా నగరంలో ముందస్తుగా 'దౌడ్ సే ధ్యాన్' (పరుగు నుండి ధ్యానం వైపు) మారథాన్, డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా గంగానదిపై 500 పడవల్లో ఒకేసారి యోగాసనాలు వేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించేందుకు చేసిన ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సహా పలువురు ఉన్నతాధికారులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని యోగా విశిష్టతను చాటారు.భారతదేశం ప్రతిపాదించిన ఈ యోగా సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా డిజిటల్, భౌతిక రూపాల్లో విస్తరించింది. విదేశాల్లోని దాదాపు 210 భారతీయ దౌత్య కార్యాలయాల సమన్వయంతో అంతర్జాతీయంగా 2,500కి పైగా ప్రధాన నగరాలు, సాంస్కృతిక కేంద్రాలలో యోగా ఉత్సవాలు జరిగాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం కూడా ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించింది. దేశంలోని కర్ణాటక, ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాల్లోనూ స్వచ్ఛత, ఫిట్‌నెస్ కార్యక్రమాలతో ముడిపెట్టి సామూహిక యోగా సెషన్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఖరీదైన పరికరాలు అవసరం లేకుండా, కేవలం శ్వాసపై నియంత్రణ, శారీరక సమతుల్యత ద్వారా ఒత్తిడిని తగ్గించి, నిద్రలేమి సమస్యలను దూరం చేసే యోగా విధానం.. ప్రస్తుత ఆధునిక వేగవంతమైన ప్రపంచంలో మానవాళికి ఒక సంజీవనిలా మారుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# చర్చలు షురూ

**మొదటిపేజీ తరువాయి**

చర్చలలో పాల్గొనేందుకు అమెరికా ఉపాధ్యక్షు డు జేడీ వాన్స్ ఇప్పటికే స్విట్జర్లాండ్ చేరుకున్నారు. తెల్లవారుజామున ఎమ్మెన్ వైమానిక స్థావరంలో సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి దిగిన ఆయన సాయుధ గార్డులు పహరా కాస్తున్న అనేక చెక్ పాయింట్లు, పచ్చని కొండలను దాటుకుంటూ ఓ ఇరుకైన రహదారి మీదుగా రిసార్టుకు చేరుకున్నారు. బర్గెన్‌స్టాక్ పట్టణం లోని విలాసవంత మైన హోటల్ కాంప్లెక్స్‌లో చర్చలు జరుగుతున్నా యి. వాన్స్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ కూడా చర్చలలో భాగస్వాములవుతున్నారు. తొలి విడత చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక దళాల ప్రధానాధికారి అశీమ్ మునీర్ కూడా స్విట్జర్లాండ్ చేరుకున్నారు. 'ఇస్లామా బాద్ ఎంఓయూ' అమలుపై జరిగే ఉన్నత స్థాయి చర్చలలో వీరు కూడా పాల్గొంటారని పాక్ ప్రధాని కార్యాలయం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలిపింది. ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ బిన్ జాసిమ్ అల్ థానీ కూడా చర్చలలో పాల్గొనే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. చర్చలలో ఇరాన్ బృందానికి పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నేతృత్వం వహిస్తుండగా సీcయర్ సెక్యూరిటీ, సెంట్రల్ బ్యాంక్, చమురు అధికారులు సభ్యులుగా ఉన్నారు.

**ఎంఓయూలోని మరిన్ని విషయాలను బయటపెట్టిన పెజెష్కియాన్**

అమెరికాతో కుదుర్చుకున్న ఎంఓయూలో ఉన్న మరికొన్ని అంశాలను ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బయటపెట్టా రు. ఆయన అందించిన వివరాల ప్రకారం స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులలో ఆరు బిలియన్ డాలర్లు ఖతార్ వద్ద ఉన్నాయి. ఎంఓయూ ప్రకారం ఇప్పుడు అవి ఇరాన్ కు తిరిగి వస్తాయి. 'ఎంఓయూలో నిబంధనలన్నీ మాకు అనుకూలంగా ఉన్నాయి. చర్చలు, సంప్రదింపులలో మేము సాధించినవి త్వరలోనే తెలుస్తాయి' అని పెజెష్కియాన్‌ను ఉటంకిస్తూ తస్నీమ్ వార్తా సంస్థ తెలియజేసింది. గతంలో అమెరికా వేటినైతే నిషేధించిందో ఇప్పుడు వాటినే ఇరాన్ ప్రజల హక్కు లుగా ప్రకటించిందని ఆయన చెప్పారు. స్విట్జర్లాండ్ చర్చలపై అసంతృప్తి వ్యక్తం చేసే వ్యక్తి ఎవరైనా ఉంటే ఆయన ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూయేనని వ్యాఖ్యానించారు. 'మా వద్ద అణుబాంబు ఉండకూడదన్నది అమెరికా ప్రధాన ఉద్దేశం. మాకు అణుబాంబు వద్దని అమరుడైన మా సుప్రీం నేత పదే పదే చెప్పారు. అదే విషయాన్ని లిఖితపూర్వకంగా చెప్పాలని అమెరికా అడిగింది. మేము అలాగే రాసి ఇచ్చాం' అని అన్నారు. కాగా ఎంఓయూలోc 14 పాయింట్లలో మొదటి దానినే అమెరికా అమలు చేయలేకపోతోందని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సలహాదారు మహమ్మద్ మఖ్బర్ ఎద్దేవా చేశారు. లెబనాన్‌లో దాడులు సహా అన్ని రకాల సైcక చర్యలు ఆగిపోతాయని ఎంఓయూలో అమెరికా హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఒప్పందం కేవలం కాగితాలకే పరిమితమైనంత కాలం మధ్యప్రాచ్య చమురు సరఫరాలు నిలిచిపోతాయని స్పష్టం చేశారు. ఎంఓయూలో ఇచ్చిన హామీల అమలుకు పట్టుబడతామని ఇస్మాయిల్ బాఖై చెప్పారు.

**హార్ముజ్‌పై భిన్న వాదనలు**

తుది విడత చర్చలు జరిపేందుకు వీలుగా కాల్పుల విరమణను ఇరాన్, అమెరికా దేశాలు మరో 60 రోజులు పొడిగించిన విషయం తెలిసిందే. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ హార్ముజ్ జలసంధిని మరోసారి మూసివేస్తున్నామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇప్పటికే ప్రకటించింది. అయితే హార్ముజ్‌లో వాణిజ్య నౌకల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయని, శనివారం యాభై ఐదు నౌకలు హార్ముజ్ మీదుగా ప్రయాణించాయని అమెరికా సెంట్రల్ కమాండ్ చెప్పింది. ఈ నౌకలలో 17 మిలియన్ బ్యారల్స్ చమురు అంతర్జాతీయ మార్కెట్లకు రవాణా అవుతోంది.

**లెబనాన్‌లో కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు**

ఓ వైపు ఇరాన్, అమెరికా, పాకిస్తాన్, ఖతార్ నేతలు స్విట్జర్లాండ్‌లో చర్చలు ప్రారంభించగా మరోవైపు దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సేనలు బాంబు దాడులు కొనసాగించాయి. ఇజ్రాయిల్ వైపు నుంచి అనేక డ్రోన్లు లెబనాన్‌లోని లక్ష్యాల వైపు దూసుకొచ్చాయి. ఇజ్రాయిల్ దాడుల కారణంగా గత రెండు రోజులలో అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడులలో 16 మంది చనిపోగా 12 మంది గాయపడ్డారు. టైర్ జిల్లాలోని బరిష్ గ్రామంపై జరిగిన దాడిలో ఒకే కcటుంబానికి చెందిన నలుగురు చనిపోయారు. అలాగే పశ్చిమ బెక్కా వ్యాలీలోని సొహ్‌మార్‌లో ఓ ఇంటిపై జరిగిన దాడిలో అందులో నివసిస్తున్న నలుగురు మరణించగా ఒకరు గాయపడ్డారు. సిడన్ జిల్లాలోని ఖానారిట్‌పై జరిగిన దాడిలో ఏడుగురు చనిపోగా 13 మంది గాయపడ్డారు. శుక్రవారం వివిధ ప్రాంతాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడులలో 83 మంది మరణించగా 141 మంది గాయపడ్డారని లెబనాన్ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

**డీల్ కుదరకపోతే హార్ముజ్‌లో సుంకాలు విధిస్తాం : ట్రంప్**

అరవై రోజుల కాల్పుల విరమణ గడువు ముగిసే లోగా ఇరాన్‌తో తుది ఒప్పందం జరగకపోతే హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలపై టోల్స్ (సుంకాలు) విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. 'కాల్పుల విరమణ అమలులో ఉన్నంత కాలం సుంకాలు ఉండవు. వాటిని విధించేది మేమే. మేము ఆ పని చేసే వరకూ అవి ఉండవు. ఒప్పందం కుదరని పక్షంలో మాత్రం మధ్యప్రాచ్య దేశాలకు అందించిన సేవల నిమిత్తంఢగత, ప్రస్తుత, భవిష్యత్ ఖర్చుల భర్తీ కోసంఢఅమెరికా స్వయంగా సుంకాలు విధిస్తుంది' అని ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో తెలిపారు.

**చర్చల ఎజెండాపై ఇరాన్ ఏమంది?**

ఇజ్రాయిల్-హిజ్బుల్లా మధ్య లెబనాన్‌లో జరుగుతున్న ఘర్షణలు ఈ చర్చల ఎజెండాలో అగ్ర స్థానంలో ఉంటాయని ఇరాన్ తెలియజేసింది. ఇచ్చిన హామీలన్నింటినీ ఇజ్రాయిల్ ప్రభుత్వం ఉల్లంఘిస్తూనే ఉన్నదని, కాబట్టి చర్చలలో అదే ప్రధానాంశం అవుతుందని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఖై చెప్పారు. స్తంభింపజేసిన ఆస్తులను ఇరాన్ కు అందుబాటులోకి తేవడం, ఇరాన్ చమురు అమ్మకాలకు అవసరమైన లైసెన్సులు జారీ చేయడం కూడా చర్చల ఎజెండాలో ఉన్నాయని వివరించారు. కాగా కాల్పుల విరమణ కొనసాగుతుందన్న నమ్మకం ఉన్నదని స్విట్జర్లాండ్ బయలుదేరి వెళ్లడానికి ముందు వాన్స్ చెప్పారు. హార్ముజ్‌ను ఇరాన్ మూసివేసిందని చెప్పడానికి ఆధారాలేవీ లేవని ఆయన అన్నారు

# జిల్లాలో నీట్ పునః పరీక్షలు ప్రశాంతంగా ముగింపు

**కట్టుదిట్టమైన భద్రత మధ్య నీట్ రీ-ఎగ్జామినేషన్ నిర్వహణ**

**1,521 అభ్యర్థులు కేటాయింపు - 1,401 మంది హాజరు**

**అవాంఛనీయ సంఘటనలు లేకుండా నీట్ పునః పరీక్షల నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, జూన్ 21( రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పునః పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం, జిల్లాలో మొత్తం 1,521 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1,401 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు.

**అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి:**
కేటాయించిన పురుష అభ్యర్థులు – 432 మంది
కేటాయించిన మహిళా అభ్యర్థులు – 1,089 మంది హాజరైన పురుష అభ్యర్థులు – 407 మంది హాజరైన మహిళా అభ్యర్థులు – 994 మంది మొత్తం హాజరైన అభ్యర్థులు – 1,401 మంది గైర్హాజరైన అభ్యర్థులు – 120 మంది మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, దివ్యాంగ (పి.డబ్ల్యు.డి.) అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కేటాయించి సాయంత్రం 6.15 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం ఆన్సర్ షీట్లను నిర్దేశిత భద్రతా నిబంధనల ప్రకారం పోస్టల్ వ్యవస్థ ద్వారా సంబంధిత అధికారులకు పంపించే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు తాగునీరు, బిస్కెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

# కర్నూలులో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో భారీగా యోగాభ్యాసం -కలెక్టర్ డా. ఎ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 21)**
12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కర్నూలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగరంలోని ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యోగాభ్యాసకులు పెద్ద సంఖ్యలో హాజరై యోగాసనాలు నిర్వహించారు.
కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యోగా శిక్షకులు, సాధకులు మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొని యోగాభ్యాసం చేశారు.
అనంతరం అధికారులు మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని వారు వివరించారు.


# కర్నూల్ మెడికల్ కాలేజీలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని అవగాహన**

**అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు నిర్వహించిన వైద్య నిపుణులు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 21)**
ప్రపంచ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం మరియు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు కర్నూల్ మెడికల్ కాలేజీలో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి సభ్యులు, యోగ శిక్షకులు, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థుల సమక్షంలో యోగాసనాలు, ప్రాణాయామం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.
కార్యక్రమానికి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మరియు కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. చిట్టి నరసమ్మ ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆమె సూచించారు.
ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డా. శోభాదేవి, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డా. మంజుల భాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. సోమశేఖర్, ఫిజియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శివరామ్, డా. ఉమామహేశ్వరి, లెక్చరర్ బి. సురేష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు సమద్, యోగ శిక్షకుడు శివరాజు, పతంజలి యోగ సమితి అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో యోగ శిక్షకుడు శివరాజును ఉపేంద్ర గౌడ్ కుమారుడు సన్మానించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగమై ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని వక్తలు ఆకాంక్షించారు

# నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష కేంద్రాలపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మిక తనిఖీ

**16 పరీక్షా కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు -క్యూఆర్టీ బృందాలు సిద్ధం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 21)**
కర్నూలు నగరంలో నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పునఃపరీక్ష సందర్భంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను స్వయంగా తనిఖీ చేసి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల (బి–క్యాంప్), పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, ఐఐఐటీడీఎం పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎస్పీ, నగరంలోని మొత్తం 16 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అభ్యర్థుల తనిఖీల కోసం ప్రత్యేక ఫ్రిస్కింగ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వొద్దని పోలీసు సిబ్బందికి ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు

# అన్నదానానికి విరాళం




**మహానంది, జూన్ 21, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది పుణ్యక్షేత్రంలో నిత్యం భక్తుల కోసం అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుడు విరాళం అందజేశారు.ఆదివారం విజయవాడకు చెందిన బి.వెంకట సుబ్బారావు కుటుంబం ఆలయ సూపర్నెంట్ నీలకంఠం రాజు కు రూ.50,116/– భక్తితో అందజేశారు.దాత నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేయగా, శేష వస్త్రాంతో సత్కరించి, బాండును స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పాములపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఘనంగా ఇంటర్నేషనల్ యోగా డే



**పాములపాడు జూన్-21 రిపబ్లిక్ న్యూస్:-**
కేంద్రమైన పాములపాడులోని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో 12వ ఇంటర్నేషనల్ యోగాడేను ఘనంగా నిర్వహించారు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొని యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీధర రెడ్డి మాట్లాడుతూ యోగ చేయడం వలన మానసిక ప్రశాంతత ఆరోగ్యము సిద్ధిస్తుందని తెలిపారు. ప్రతిరోజు ప్రతి ఒక్కరు యోగా కార్యక్రమాలకు ఉదయం పూట కొంత సమయాన్ని కేటాయించి మానసిక ప్రశాంతతను, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫిజికల్ డైరెక్టర్ కలబండి.రాజశేఖర్, హైమావతి, శారద, మనోరంజని, స్వామి శేఖర్, దామరేకుల రవి, సుబ్బనాయక్ రాంప్రసాద్, నజీర్ భాష, శ్రీనివాసులు, ఖాజా హుస్సేన్, ద్రాక్షాయని బాయి, సుహాసిని, చిన్న భారతి, శివ నాగలక్ష్మి, జయలత, విజయబాబు, ఏ.సుధాకర్, మల్లిక, రవీంద్ర నాయుడు, రమణి బాయి, మురళి రంగారెడ్డి, రామకృష్ణ, భవిత పాఠశాల ఉపాధ్యాయులు శంషుద్దీన్, రామమూర్తి, మరియు యోగా మాస్టర్ ట్రైనర్ గాండ్ల శివ, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవమును విజయవంతం చేశారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 21(రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త రామచంద్రుడు అకాల మరణం పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రామభూపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా రామచంద్రుడు కుటుంబానికి రూ.30,000/– ఆర్థిక సహాయం అందజేసి, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు పార్టీకి బలమైన పునాదులని, వారి కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు.కార్యకర్త కష్టంలో ఉంటే ముందుగా గుర్తొచ్చే పేరు కాటసాని. రామచంద్రుడు కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటాను. వారి కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తాను అని కాటసాని రామభూపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల జడ్పీటీసీ రంగనాథ్ గౌడ్,పాలకొలను రమేష్, అక్కిమి హనుమంత రెడ్డి,ఉలిందకొండ రమణారెడ్డి,గుట్టపాడు రామకృష్ణ రెడ్డి,మద్దయ్య, మాబాషా,బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పరీక్ష నిర్వహణపై కలెక్టర్ సిరి ఆకస్మిక తనిఖీ




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 21)**నీట్ పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల, కేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్న కలెక్టర్, విద్యాశాఖ, పోలీసు, వైద్య, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పరీక్షలను సజావుగా నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50% విద్యారాయితీ..

## జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరికి యుజెఎఫ్ కృతజ్ఞతలు

**అర్ధనగ్న ప్రదర్శన విరమణ ప్రకటించిన యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం**

**జర్నలిస్టుల చిరకాల డిమాండ్‌కు పరిష్కారం లభించిందని హర్షం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 21)**




కర్నూలు జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం విద్యారాయితీ కల్పిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశాలు జారీ చేయడంపై యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జిల్లా జర్నలిస్టుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

జర్నలిస్టుల పిల్లలకు విద్యారాయితీ కల్పించాలని గత 15 సంవత్సరాలుగా వివిధ జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వాలు, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వస్తున్నప్పటికీ ఫలితం దక్కలేదని యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గిలిగిత్త విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి యు. రాజశేఖర్ తెలిపారు.ఈ నేపథ్యంలో విద్యారాయితీ సాధన కోసం ఈ నెల 22న అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించాలని యుజెఎఫ్ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అయితే జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మానవతా దృక్పథంతో స్పందించి, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నెల 17న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం విద్యారాయితీ కల్పించేలా చర్యలు చేపట్టారని తెలిపారు.జర్నలిస్టుల చిరకాల సమస్యకు పరిష్కారం లభించడంతో ఈ నెల 22న చేపట్టాలని నిర్ణయించిన అర్ధనగ్న ప్రదర్శనను విరమించుకుంటున్నట్లు యుజెఎఫ్ ప్రకటించింది. జర్నలిస్టు కుటుంబాలకు ఊరట కలిగించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరికి జిల్లా జర్నలిస్టులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు యుజెఎఫ్ నాయకులు పేర్కొన్నారు.

# జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

**జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతర పోరాటం**

**(ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు ఈ.ఎన్.రాజు**

**ఘనంగా ఏపీయూడబ్ల్యూజే మండల మహాసభ**

**నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గోపాల్, రాజేంద్ర**





**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 21(రిపబ్లిక్ న్యూస్)**

జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు ఈ.ఎన్.రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, జిల్లా సహాయ కార్యదర్శి శివ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీఎల్ఆర్సీ భవనంలో ఏపీయూడబ్ల్యూజే మండల మహాసభ జరిగింది. ఈ మహా సభకు స్వాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. జర్నలిస్టుల హక్కుల కోసం ఆవిర్భవించిన సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్, బస్సు పాస్, హెల్త్ కార్డు సౌకర్యం కోసం పోరాటం చేసిన సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. అలాగే జర్నలిస్టులకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, హౌసింగ్, సంక్షేమ నిధి, జర్నలిస్టుల పెన్షన్ సౌకర్యం కోసం కూడా ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. ఇవే కాక జర్నలిస్టుల పై ఎక్కడ దాడులు జరిగినా.. ముందుండి పోరాటం చేస్తున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కు అనుబంధంగా కొనసాగుతూ దేశవ్యాప్తంగా బలమైన సంఘంగా ఎదిగిందన్నారు. జిల్లాలో కూడా అన్ని మండలాల్లో, నియోజకవర్గాల్లో స్వస్థగత నిర్మాణం కలిగి ఉన్న ఏకైక సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. జర్నలిస్టుల సమస్యలపైన, వారి ఇబ్బందులు, బాధల పై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. ముందుకు వెళుతున్నామన్నారు. ఇప్పటికే మెజార్టీ జర్నలిస్టులు ఏపీయూడబ్ల్యూజే తో నడుస్తున్నారని, మిగిలిన వారు కూడా నడిచేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు.మండలంలో కూడా జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ.ఎవరికి ఏ సమస్య వచ్చినా.అండగా నిలవాలని, జిల్లా కమిటీ కూడా అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మండల నూతన కమిటీ

ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులుగా గోపాల్, ప్రధాన కార్యదర్శి గా రాజేంద్రుడు, కోశాధికారిగా ఇంతియాజ్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, వీర, రాజేష్, సహాయ కార్యదర్శులు గా స్వాములు, నాగరాజు, శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు గా విరుపాక్షి, మౌలాలి, కుమార్, మునిస్వామి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# యోగాభ్యాసం దినచర్యలో భాగం కావాలి

## శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కమతం సునీత

**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 21(రిపబ్లిక్ న్యూస్)**




ప్రతి ఒక్కరు యోగబ్యాసాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని ఓర్వకల్లు మండల పరిధిలోని శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కమతం సునీత సూచించారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సచివాలయ సిబ్బందితోపాటు విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ చేయగలిగే వ్యాయామం యోగాసనాలన్నారు. ప్రపంచానికి భారతదేశము అందించిన గొప్ప వరం యోగా అన్నారు.ప్రపంచ దేశాలను సైతం మన యోగ సాంప్రదాయం ప్రకారం ఒప్పించి దాదాపు 200 దేశాలకు పైగా నేడు ప్రపంచ యోగా దినోత్సవం లో భాగస్వామ్యం చేసిన ప్రధాని మోడీ అందరికీ స్ఫూర్తి ప్రదాత అని ఆమె గుర్తు చేశారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి రోజు కొంత సమయాన్ని యోగ సాధనకు ఉపయోగించాలని ఆమె కోరారు. అంతకుముందు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మహమ్మద్ భాష,నరసింహులు యోగాసనా ప్రోటోకాల్ ప్రకారం విద్యార్థులకు సూక్ష్మ వ్యాయామం, యోగాసనాలు, ప్రాణాయామం,ధ్యానం, ప్రార్థనలతో యోగాను ఫిజికల్ గా చేయించారు.వారం రోజులపాటు పాఠశాలలో యోగ ప్రాక్టీస్ సెషన్, చిత్రలేఖన యోగాసన పోటీలను నిర్వహించారు.(విజేతలకు సచివాలయ కార్యదర్శి గోపీనాథ్ ఆర్థిక సౌజన్యంతో అందించిన బహుమతులను గ్రామ పెద్ద చంద్రమౌళీశ్వర రెడ్డి చేతుల మీదుగా బహుకరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు కృష్ణప్ప, గజేంద్రుడు,సుమిత్ర పాల్,రత్నకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మహమ్మద్ బాషా, నరసింహులు విద్యార్థులు పాల్గొన్నారు

# పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యం

## రేపటి రామాంజనేయులు -ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల నూతన కమిటీ ఏకగ్రీవం

**అనంతపురం / శింగనమల, జూన్ 21,(రిపబ్లిక్ న్యూస్ ):**




జర్నలిస్టులు పోరాటాల ద్వారానే హక్కులు సాధించగలరని

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు పేర్కొన్నారు. శింగనమల మండల కేంద్రంలోని శ్రీ మసూద్ స్వామి దర్గా కమ్యూనిటీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నికల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### జర్నలిస్టుల డిమాండ్ల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి

ఈ సందర్భంగా కింద ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి భద్రత కోసం ప్రభుత్వం స్పందించేలా సంఘటితంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యతతో ముందుకు సాగితేనే పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షఫీ ఉల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఆర్.కె. సూర్య, కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శింగనమల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు ఆర్. మునెప్ప (సాక్షి), మండల అధ్యక్షుడిగా పేట ఆదినారాయణ (ప్రజాశక్తి), ప్రధాన కార్యదర్శిగా భూమా రామాంజనేయులు అలియాస్ రాము యాదవ్ (నేటి దినపత్రిక-సూర్య), ఉపాధ్యక్షులుగా రాచేపల్లి సాంబ (ఎన్‌టీయూఎం న్యూస్), నిదనవాడ సూర్యచంద్రారెడ్డి (ఫోకస్ అనంత), కోశాధికారిగా సి. ముత్యాలు (అనంతప్రభ), సహాయ కార్యదర్శులుగా ఎం. పెద్దన్న (వైఎస్సార్ టీవీ), నాగశేషు (జనసూర్యశ్రీ), ఓబులేష్ (మనం న్యూస్) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బాలరాజు (6 టీవీ), నాగేష్ (ఆంధ్రజ్యోతి), చంద్రమోహన్ (టీవీ5), జయకృష్ణ (10 టీవీ), నరేష్ (99 టీవీ), ఆంజనేయులు (సీమ స్వర్ణం), హరి (నిఘా టీవీ), శివమూర్తి, నాగేశ్వరరావు (ఆంధ్రప్రభ)లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.వీరితోపాటు ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యరవి, గౌరవాధ్యక్షుడు కేశవనాయుడు, కమిటీ సభ్యులు మురళి, వెంకటేష్, జర్నలిస్టులు ఉన్నారు.

# ఎంపీ పీవీ మిథున్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి.



**రైల్వే కోడూరు జూన్ 21 రిపబ్లిక్ న్యూస్.**

రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పివి మిథున్ రెడ్డిని డి ఆర్ యు సి సి సభ్యులు, వైసిపి రాయలసీమ జోన్ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆయనస్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు . ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమం గురించి ఆరా తీయడం జరిగింది అంతేకాకుండా ఓటర్లకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైయస్సార్సీపి పార్టీ తరపున పూర్తిస్థాయిలో ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరినట్లు భరత్ కుమార్ రెడ్డి తెలిపారు

# జూద స్థావరంపై మెరుపు దాడులు .. 22 మంది అరెస్ట్

## రూ.2.06 లక్షల నగదు, 13 ద్విచక్ర వాహనాలు, 21 సెల్‌ఫోన్లు స్వాధీనం

**శ్రీ సత్యసాయి / కదిరి క్రైమ్, జూన్ 21,(రిపబ్లిక్ న్యూస్ ):**




కదిరి నియోజకవర్గం తనకల్లు మండలంలోని కొత్తికోట గ్రామ శివారులో జూదం ఆడుతున్న స్థావరాలపై పోలీసులు మెరుపుదారులు చేశారు. దాడిలో 22 మంది జూదారులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.06 లక్షల నగదు, 13 ద్విచక్ర వాహనాలు, 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి పర్యవేక్షణలో కదిరి సబ్‌డివిజన్ పరిధిలో పోలీసులు నిరంతరం అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆదివారం కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, తనకల్లు ఎస్ఐ దిలీప్‌కుమార్, నల్లచెరువు ఎస్ఐ మక్బుల్‌తో పాటు పోలీసు సిబ్బంది తనకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తికోట గ్రామ శివారులో జీవితం ఆడుతున్న వారిపై ఆకస్మికంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 22 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,06,400 నగదు, 13 మోటార్‌సైకిళ్లు, 21 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. జూదం, బెట్టింగ్‌లు, మట్కా, గుట్కా విక్రయాలు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తమ ప్రాంతాల్లో జూదం, బెట్టింగ్‌లు లేదా ఇతర అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసు అధికారులకు తెలియజేయాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# తెగి పడిన మైన్ వైరు

## తృటిలో తప్పిన ప్రమాదం

**అనంతపురం క్రైమ్, జూన్ 21,(రిపబ్లిక్ న్యూస్ ):**



నగరంలోని రాణి నగర్ ప్రాంతంలో మీనా మసీదు సమీపంలో ఆదివారం రాత్రి పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రధాన విద్యుత్ వైరు అకస్మాత్తుగా తెగి రోడ్డుపై పడటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.విషయాన్ని స్థానికులు వెంటనే సంబంధిత డివిజన్ ఇంచార్జులకు తెలియజేయగా వారు తక్షణమే స్పందించారు. ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తెగి పడిన మైన్ వైరును మరమ్మతులు చేసి ప్రమాదాన్ని నివారించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దగ్గరుండి పనులను పర్యవేక్షించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

**వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి :**ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే స్పందించి ప్రమాదాన్ని నివారించిన ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, డివిజన్ ఇంచార్జులు, విద్యుత్ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలంలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లైన్లను ముందస్తుగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

# మనసుకు ప్రశాంతతే యోగ లక్ష్యం

## యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది -చైర్మన్ రామిరెడ్డి సూచన






**అనంతపురం సంక్షేమం, జూన్ 21,(రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగర న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక యోగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు అభ్యసించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ రామిరెడ్డి ప్రారంభించారు.

**మానసిక సమస్యలకు యోగ ఉత్తమ పరిష్కారం**

ఈ సందర్భంగా చైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, మానసిక సమస్యలకు యోగ ఉత్తమ పరిష్కారమని అన్నారు. ప్రతిరోజూ కొద్దిసేపు యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే యోగను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.యోగ శిక్షకురాలు మానస విద్యార్థులకు సూర్యనమస్కారాలు, తాడాసనం, వజ్రాసనం, భుజంగాసనం, పద్మాసనం వంటి వివిధ ఆసనాలతో పాటు ప్రాణాయామం, ధ్యాన విధానాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. యోగ సాధన వల్ల ఏకాగ్రత పెరిగి చదువులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల అధిక వినియోగం వల్ల కలిగే మానసిక అలసటను తగ్గించడంలో ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

**యోగ భారతీయ సంస్కృతికి గొప్ప వారసత్వం**

విద్యార్థులు మాట్లాడుతూ యోగ సాధనతో తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, ప్రశాంత భావన కలుగుతోందని తెలిపారు. యోగ భారతీయ సంస్కృతికి గొప్ప వార సత్వమని, ప్రపంచవ్యాప్తంగా దీనికి లభిస్తున్న ఆదరణ గర్వకారణమని పేర్కొన్నారు. చివరగా కళాశాల నిర్వహణ సభ్యులు యోగను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకర జీవనానికి ప్రతిరోజూ యోగ చేయాలని పాల్గొన్న వారందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పారిశుద్ధ్య కార్మికులతో రోడ్లు ఊడుస్తున్న ముక్కా





**రైల్వేకోడూరు జూన్ 21 రిపబ్లిక్ న్యూస్** ఓబులువారిపల్లి మండలంలోని మంగంపేట గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పాల్గొన్నారు, పారిశుధ్య కార్మికులతో కలిసిరూపానందరెడ్డి స్వయంగా రహదారులను శుభ్రపరిచి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యంగా ఉంటారని,స్వచ్ఛత, పరిసరాలు శుభ్రముగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు.

పారిశుధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడిన ఆయన, వారి కృషి వల్లే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని వారి వల్లే గ్రామాలలో అందరూ ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రూపానంద్ రెడ్డి తో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కల్లా చలపతి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి ఎన్ డి ఏ కూటమి నాయకులు,, కార్యకర్తలు స్థానిక ప్రజలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

# ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన కళ్యాణ్ భరత్



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 21 రిపబ్లిక్ న్యూస్** రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని వైఎస్ఆర్సిపి రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ కలిశారు ఆదివారం తిరుపతి లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు ,అదే సందర్భంగా కళ్యాణ్ భరత్ మాట్లాడుతూ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సర్ కార్యక్రమం పార్టీ కార్యకలాపాలు కార్యకర్తల గురించి , అడిగి తెలుసుకున్నారని అన్నారు, స్థానిక సంస్థల ఎన్నికల గురించి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు అని తెలిపారు, అనంతరం విద్యార్థుల సమస్యల గురించి మిథున్ రెడ్డికి తెలుపగా వారు సానుకూలంగా స్పందించారు అని అన్నారు,ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షులు చంగల్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి నాగేంద్ర, విద్యార్థి నాయకులు ప్రవీణ్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ం

# బోయకొండపై ఏపీ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో చల్లని పానీయాలు పంపిణీ





**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 21 రిపబ్లిక్ న్యూస్** శక్తి క్షేత్రం బోయకొండపై ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో భక్తులకు చల్లని పానీయాలు పంపిణీ చేశారు.క్యూ లైన్ ల వద్ద కమిషనర్ ఏకాంబరంచే చల్లని మజ్జిగ వంటి పానీయాలు అందించారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు భక్తులకు సేవ చేయడానికి ముందుకు వచ్చిన బ్యాంకు సిబ్బందిని ఏకాంబరం అభినందించారు ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి సిబ్బంది మౌళి సత్య ఆలయ అధికార సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్ తో పాటు సిబ్బంది ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం ను ఆయన చాంబర్లో ఘనంగా సన్మానించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 21 రిపబ్లిక్ న్యూస్**

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చౌడేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమా శంకర్ రెడ్డి అన్నారు ఆదివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు నందు అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఉపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థులు యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రతి ఒక్కరూ యోగాను దైనందిక జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు యోగాతో సంపూర్ణంగా ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని దీర్ఘ స్వల్పకాలిక వ్యాధులు సైతం దూరం అవుతాయని ఈ సందర్భంగా వారు అన్నారు చిన్నతనం నుండి యోగాకు అలవాటు పడాలని పూర్వీకుల నుంచి తమకు యోగ వరంలా వచ్చిందని ఈ సందర్భంగా వారు అన్నారు ప్రతి ఉదయం యోగాను అలవర్చుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి.




**రైల్వే కోడూరు జూన్ 21 రిపబ్లిక్ న్యూస్.**

ఆశా వర్కర్లను వైద్య ఆరోగ్యశాఖ వర్కర్లుగా గుర్తించాలని జిల్లా ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం రైల్వే కోడూరు ఆశా వర్కర్ల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని ఉద్యోగ భద్రత జీతాలు పెంపు పలు సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,

ఏఐటీయూసీ కి అనుబంధంగా ఉన్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం రత్నమ్మ అధ్యక్షతన జరిగినది, రత్నమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను జీవోల రూపంలో విడుదల చేయాలని ఆమె కోరారు,

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ గంగాధరశీ లు పాల్గొన్నారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని గత పది సంవత్సరాల కాలంగా పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తున్న అధికారులు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నాయి తప్ప అమలు చేయడం లేదని,ఇచ్చిన హామీలను సైతం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను సైతం జీవోల రూపంలో ఇచ్చి అమలు పరచడం లేదని వారు అన్నారు,

ఆశా వర్కర్లకిస్తున్న పదివేల రూపాయల వేతనం వారు తిరగడం కోసం హాస్పిటల్ కి పి హెచ్ సి లకు వెళ్లి రావడానికి సరిపోతుందని పిహెచ్సి లకు గ్రామాలలో తిరిగి సర్వేలు నిర్వహించటానికి ట్రాన్స్పోర్ట్ లకే అయిపోతుందని మరి కుటుంబానికి ఏ రకంగా అండగా ఉంటామని ఆశాలు ఆవేదన వ్యక్తం చేశారు,

ఆశలు చేయవలసిన పనులే కాకుండా అదనపు పనుల భారం కూడా ఆశా వర్కర్ల దగ్గర చేయిస్తున్నారని రాత్రి షిఫ్టుల్లో డ్యూటీలు చేయాలని టెస్టులు చేయాలని సర్వేలు చేయాలని గళ్ళ పరీక్షలు ఎత్తుకొని రావాలని బి పీలు, షుగర్, టెంపరేచర్ చూడాలని రకరకాల పనులతో ఆశలను ఇబ్బంది పెడుతున్నానని ఇది సరైనది కాదని పనులు చెప్పే అధికారులు జీతాలు పెంపు విషయములో కూడా చర్యలు తీసుకోవాలన్నారు

రానున్న కాలంలో ఆశా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ అనుబంధంగా గల ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహిస్తామని అందులో ఆశాలు పెద్ద ఎత్తున కదలి రావాలి అని అన్ని పీ హెచ్ సి ల లో జరుగుతున్న ఆశాలపై అదనపు పనులు చేయించరాదని అలా చేయించిన ఎడల డి ఎం హెచ్ ఓ దృష్టికి తీసుకు వెళ్తానని డిఎంహెచ్వో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన ఆశ చార్ట్ ప్రకారం మాత్రమే మేము పనులు నిర్వహిస్తామని అన్నారురాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలకు చిత్తశుద్ధితో జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఆశా వర్కర్స్కుగౌరవ వేతనం 26వేలకు పెంచాలి సంబందం లేని ఆన్ లైన్ పనులు చేయించరాదు,పనిభారాన్ని తగ్గించాలి,ప్రభుత్వ శెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ అమలు చెయ్యాలి. దానికి వెంటనే జీవోను విడుదల చేయాలి రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలి. 62 సంవత్సరాల రిటైర్మెంట్ ఆశాలకు కూడా వర్తింపచెయ్యాలి. 2020 మార్చి కోవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు 10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి.కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలి.

10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

ఎన్ హెచ్ ఎం నిబంధనల ప్రకారం 1000-1200ల జనాభాకు ఒక ఆశా వర్కర్లు నియమించాలి. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశాలందరికీ వర్తింపచెయ్యాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా 5జి సిమ్ సపోర్ట్ చేసే నాణ్యమైన సెల్ ఫోన్స్ ఇవ్వాలి. గౌరవ వేతనం ఒకేసారి ఇవ్వాలి. రాత్రి షిఫ్ట్ లు ఆశాలకు వేయరాదు ఈ డిమాండ్ల సాధన కోసం రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని వారు సమావేశంలో తీర్మానించారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు చిన్నయ్య జయరాం రాజశేఖర్ కృష్ణ చైతన్యలు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రత్నమ్మ చంద్రమ్మ వజ్రమ్మ రెజియా కుమారి విజయ ధనలక్ష్మి రత్నమ్మ సరిత సుబ్బలక్ష్మి శివకుమారి యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డి అందోల్ నియోజకవర్గం లో టీ వై జె ఎఫ్ తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆత్మీయ సమావేశం







**అందోల్ ప్రతినిధి జూన్ 21( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** జోగిపేట సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేటలోని ముదిరాజ్ భవన్‌లో తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టీ వై జె ఎఫ్ ) ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులకు ఐడి కార్డులు, హెల్త్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు మెమెంటోలు అందజేశారు. అలాగే అందోల్ నియోజకవర్గ నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో మతికే అతిథులుగా టీ వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహబూబ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమణి అశోక్ జిల్లా కార్యదర్శి కే నరేష్ పాలుగోన్నారు జోగిపేట్ టీ వై జె ఎఫ్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో, నియోజకవర్గాల్లో జర్నలిస్టుల పట్ల జరుగుతున్న వివక్షను ఖండించారు. అక్రిడిటేషన్ ఉన్నవారికే సమాచారం ఇవ్వడం, కార్యక్రమాలకు ఆహ్వానించడం, చిన్న పత్రికలు మరియు చిన్న ఛానళ్లలో పనిచేస్తున్న విలేకరులను తక్కువగా చూడడం వంటి చర్యలను మానుకోవాలని కోరారు.

“మేము కూడా జర్నలిస్టులమే. చిన్న పత్రికైనా, చిన్న ఛానల్ అయినా ప్రజలకు సమాచారంఅందించడంలో మా పాత్ర ఎంతో కీలకం. అందరికీ సమాన గౌరవం, అవకాశాలు కల్పించాలి” అని వారు పేర్కొన్నారు“మేము కూడా జర్నలిస్టులమే. చిన్న పత్రికైనా, చిన్న ఛానల్ అయినా ప్రజలకు సమాచారం అందించడంలో మా పాత్ర ఎంతో కీలకం. అందరికీ సమాన గౌరవం, అవకాశాలు కల్పించాలి” అని వారు పేర్కొన్నారు..

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం టీ వై జె ఎఫ్ మరింత చురుకుగా పనిచేయాలని, విలేకరుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహబూబ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమణి





అశోక్, జిల్లా కార్యదర్శి కె. నరేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు యాదగిరి ప్రకాష్, అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు జై రాజు, ప్రధాన కార్యదర్శి ఎం. బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి భాగయ్యతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు

# కాపుల తరఫున పోరాటం!

**బాధితులకు అండగా ఉందాం**

**సాయికృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం**

**ఆత్మీయ సమావేశంలో తీర్మానాలు**




**అమలాపురం/ద్రాక్షారామ, జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):**
కూటమి ప్రభుత్వం కాపులపై దాష్టీకాలకు పాల్పడుతోందని, దీనిపై పోరాడాలని వైసీపీ కాపు నేతలు నిర్ణయించారు. ఆదివారం వెంకటాయపాలెంలోని ఒక కల్యాణ మండపంలో సుమారు నాలుగు గంటలపాటు వీరు చర్చలు జరిపారు. విజయవాడ కృష్ణలంకలో రౌడీ షీటర్ గాదె సాయికృష్ణ కేసును ప్రస్తావిస్తూ... రాష్ట్రంలో ఎక్కడైనా కాపులకు అన్యా యం జరిగితే... నేరుగా అక్కడికి వెళ్లి ధైర్యం చెప్పాలని తీర్మానించారు. దీనికోసం మూడు ప్రాంతాల్లో మూడు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాపు బాధితులకు క్లౌడ్ ఫండిం గ్ ద్వారా నిధులు సేకరించి ఆదుకోవాలని కూడా నిర్ణయించారు. భేటీకి హాజరైన నేతలంతా రూ. 50వేలు తగ్గకుండా సేకరించి సాయికృష్ణ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానించారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభరెడ్డి కోలుకుని తమ పక్షాన తిరిగి పోరాడాలని ఆకాంక్షిస్తూ తీర్మానం చేశారు. విశాఖలో, తిరుపతిలోనూ ఇలాంటి సమావేశాలు పెట్టాలని తీర్మానించారు. "ఈ సమావేశంపై మీడియాలో విభిన్న కథనాలు వచ్చా యి. ఇది ఒక వ్యక్తి కోసమో, ఒక సంఘటనను ఖండించడానికో పెట్టింది కాదు" అని కన్నబాబు పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. పూర్తిగా దగ్ధం

**తిమ్మాపూర్:జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):**
కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు సుమారు 40 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధ మైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఉద యం కరీంనగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ కు ప్రయాణికులతో బయలు దేరింది. దాదాపు మూడు, నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణం పూర్తి చేసి అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ వద్దకు రాగానే బస్సులో అకస్మాత్తుగా దట్ట మైన పొగ, మంటలు రావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ బస్సును రోడ్డు పక్క న ఆపి డోర్లు,ఎమర్జెన్సీగేట్లు తెరిచి ప్రయాణికులందరినీ సురక్షితంగా బయట కుదించాడు. అనంతరం బస్సులోని అగ్నిమాపక పరికరాలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేక పోగా, మంటలు



వేగంగా వ్యాపించి నిమిషాల్లోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బస్సులో అకస్మాత్తు గా మంటలు ఎలా వ్యాపించాయో తెలియాల్సి ఉంది.

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం

**: సింగరేణి యాజమాన్యం**

**రూ.1,600 కోట్ల బొగ్గు కుంభకోణం ఆరోపణలను ఖండించిన సింగరేణి**

**బొగ్గు ఉత్పత్తి, రవాణాలో పూర్తి పారదర్శకత ఉందని స్పష్టం**

**40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో నిజం లేదని ప్రకటన**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖతో తెరపైకి వచ్చిన బొగ్గు గల్లంతు ఆరోపణలు**

**అత్యాధునిక టెక్నాలజీతో నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని వివరణ**




**సింగరేణి జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):**
సింగరేణిలో రూ. 1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది. గనుల్లో బొగ్గు వెలికితీసిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి అంశం డిజిటల్‌గా నమోదవుతుందని కంపెనీ వివరించింది. సుమారు 85 శాతం బొగ్గు రైళ్ల ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని, శాప్ (ఎస్ఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ద్వారా బొగ్గు కేటాయింపులు జరుగుతాయని పేర్కొంది. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వే-బ్రిడ్జ్‌ల వద్ద తూకం వేస్తామని, ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బారియర్లు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత మధ్య బొగ్గు దొంగతనం లేదా మాయం కావడానికి ఆస్కారమే లేదని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి 51:49 వాటాలు ఉన్న సింగరేణి సంస్థలో ఈ ఆరోపణలు కలకలం రేపాయి.

# జులైలో ఆకాశంలో అద్భుతాల జాతర..
# గ్రహాల కలయిక నుంచి ఉల్కాపాతం వరకు!


**జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):**
ఖగోళ ప్రియులకు, ఆకాశాన్ని ఆసక్తిగా గమనించే వారికి 2026 జులై నెల ఒక కనుల పండుగ తీసుకురాబోతోంది. గ్రహాల అరుదైన కలయికల నుంచి ఉల్కాపాతాల వరకు అనేక అద్భుత దృశ్యాలు ఈ నెలలో ఆవిష్కృతం కానున్నాయి. సాధారణ కంటితో చూడగలిగేవి కొన్ని అయితే, బైనాక్యులర్ల సహాయంతో మరికొన్నింటిని వీక్షించవచ్చు. ఈ నెలలో జరగబోయే ముఖ్యమైన ఖగోళ విశేషాలు వరుసగా ఉన్నాయి, వీటిని వీక్షించడం ద్వారా మరపురాని అనుభూతిని పొందవచ్చు.

**అంగారకుడు, యురేనస్ అరుదైన కలయిక**

ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున తూర్పు ఆకాశంలో అంగారకుడు (మార్స్), యురేనస్ గ్రహాలు చాలా దగ్గరగా కనిపించి కనువిందు చేస్తాయి. ఇది చాలా అరుదైన గ్రహాల కలయిక. ప్రకాశవంతమైన అంగారకుడిని సాధారణ కంటితో చూడగలిగినప్పటికీ, యురేనస్‌ను స్పష్టంగా చూడాలంటే బైనాక్యులర్లు లేదా చిన్న టెలిస్కోప్ అవసరం. స్పష్టమైన ఆకాశం ఉంటే ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుంచి ఈ దృశ్యాన్ని వీక్షించవచ్చు.

**సూర్యుడికి అత్యంత దూరంగా భూమి**

జులై 6న భూమి సూర్యుడి నుంచి తన కక్ష్యలో అత్యంత దూరంలోకి వెళ్తుంది. దీనిని ఖగోళ పరిభాషలో 'అపహేలి'



అంటారు. ఆ రోజు భూమికి, సూర్యుడికి మధ్య దూరం సుమారు 152.1 మిలియన్ కిలోమీటర్లు ఉంటుంది. ఇది కంటికి కనిపించే అద్భుతమేమీ కానప్పటికీ, భూమిపై రుతువులు ఏర్పడటానికి సూర్యుడికి, భూమికి మధ్య దూరం కారణం కాదని, భూమి అక్షం వంపు వల్లే రుతువులు ఏర్పడతాయనే శాస్త్రీయ వాస్తవాన్ని గుర్తుచేసే ఒక ముఖ్యమైన సందర్భం ఇది.

**మాన్‌హాటన్‌హెంజ్, అమావాస్య**

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జులై 11–12 తేదీల్లో 'మాన్‌హాటన్‌హెంజ్' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. సూర్యాస్తమయ సమయంలో సూర్యుడు నగరం యొక్క తూర్పు-పడమర వీధులకు సరిగ్గా మధ్యలో ప్రకాశిస్తూ, ఆకాశహర్మ్యాల మధ్య అగ్నిగోళంలా కనిపిస్తాడు. ఇక జులై 14న అమావాస్య వస్తుంది. ఆ రోజు ఆకాశం అత్యంత చీకటిగా ఉంటుంది కాబట్టి, పాలపుంత కేంద్ర భాగాన్ని, ఇతర నక్షత్ర మండలాలు, సుదూర ఖగోళ వస్తువులను వీక్షించడానికి ఇది అనువైన సమయం.

**చంద్రుడు-శుక్రుడు, బక్ మూన్**


జులై 17న సూర్యాస్తమయం తర్వాత పశ్చిమ వాయువ్య దిశలో సన్నని చంద్రవంక ప్రకాశవంతమైన శుక్ర గ్రహానికి (వీనస్) చాలా దగ్గరగా కనిపిస్తుంది. ఇది సాధారణ కంటితో చూడగలిగే ఎంతో అందమైన దృశ్యం. ఆ తర్వాత, జులై 29న పౌర్ణమి వస్తుంది. దీనిని 'బక్ మూన్' అని పిలుస్తారు. ఈ సమయంలో మగ జింకలకు కొత్త కొమ్ములు పెరుగుతాయి కాబట్టి ఈ పేరు వచ్చింది.

**డెల్టా అక్వారిడ్స్ ఉల్కాపాతం**

ఈ నెలాఖరున, జులై 30–31 తేదీలలో, సదరన్ డెల్టా అక్వారిడ్స్ ఉల్కాపాతం గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఇది వేసవిలో నమ్మకంగా కనిపించే ఉల్కాపాతాలలో ఒకటి. అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజాము వరకు (సుమారు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 4–5 గంటల మధ్య) గంటకు డజన్ల కొద్దీ ఉల్కలు ఆకాశంలో మెరిసి మాయమవుతాయి.

## విలేకరి ఫోన్‌కు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు

### 14వ వార్డులో సమస్యలు, కౌన్సిలర్ ఎక్కడ అంటూ ప్రజల ఆవేదన





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 21 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జోగిపేట మున్సిపాలిటీ 14వ వార్డులో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న వైర్లు, ఇతర మౌలిక వసతుల సమస్యలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఓ విలేకరి విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ వెంటనే స్పందించి సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. లైన్మెన్ మల్లికార్జున్ తన బృందంతో కలిసి ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లను సరిచేసి సమస్యను పరిష్కరించారు. అయితే వార్డులో నెలకొన్న ఇతర సమస్యలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "వార్డుకు కౌన్సిలర్ ఉన్నాడా లేదా అన్న అయోమయంలో ఉన్నాం. ప్రజా సమస్యలను పట్టించుకునే వారు కనిపించడం లేదు" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరి ఫోన్‌కు స్పందించి వెంటనే చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులను ప్రజలు అభినందిస్తూనే, వార్డు ప్రజాప్రతినిధులు కూడా ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

## అందోల్-జోగిపేటలో తెలంగాణ రాష్ట్ర సేన జెండా ఆవిష్కరణ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 21( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్–జోగిపేట పట్టణంలో ఆచార్య కొత్తపల్లి ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మాసన్న గారి బాలయ్య మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆయన ఫోటోకు పూలమాలవేసి వర్ధంతి నివాళు లు అర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మాజీ జడ్పీ చైర్మన్ మసన్న గారి బాలయ్య జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల మద్దతు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా ఆవిష్కరణను విజయవంతం చేశారు. అనంతరం నాయకులను పూలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## టీ వై జె ఎఫ్ యూనియన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు.

### మైనార్టీ యూత్ ఐకాన్ చోటు ఖాన్.



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 21 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
జోగిపేటలో జరిగిన టీ వై జె ఎఫ్ సమావేశానికి హాజరైన యూత్ మైనార్టీ నాయకుడు చోటు ఖాన్, ఈ సందర్భంగా చోటు ఖాన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలికి తీయడంలో పత్రిక విలేకరుల ప్రాధాన్యత గొప్పదని ఆయన అన్నారు. అంతేకాకుండా సమాజంలో అనుక్షణం ఎక్కడ సమస్య ఉన్న స్పందించే కర్తవ్యం కలిగిన వ్యక్తులు పాత్రికేయులు. పాత్రికేయులకు టీ వై జె ఎఫ్ యూనియన్ ఐడి కార్డు పంపిణీ, హెల్త్ కార్డుల పంపిణీ, పత్రికా విలేకరుల పిల్లల చదువుల కోసం ప్రైవేట్ పాఠశాలలో ఉచితంగా విద్యను అభ్యసించడం కోసం సంగారెడ్డి జిల్లా డిఇఓ రోహిణి జారీ చేయడం చాలా శుభ పరిణామంగా భావిస్తూ టీ వై జె ఎఫ్ యూనియన్ నన్ను ఆహ్వానించి సత్కరించారు ప్రత్యేక ధన్యవాదాలు మైనార్టీ యూత్ ఐకాన్ చోటు ఖాన్ అన్నారు.

## టీ వై జె ఎఫ్ యూనియన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు.

### - మైనార్టీ నాయకుడు నజీర్.



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 21 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
జోగిపేటలో జరిగిన టీ వై జె ఎఫ్ సమావేశానికి హాజరైన యూత్ మైనార్టీ నాయకుడు నజీర్, ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలికి తీయడంలో పత్రిక విలేకరుల ప్రాధాన్యత గొప్పదని ఆయన అన్నారు. అంతేకాకుండా సమాజంలో అనుక్షణం ఎక్కడ సమస్య ఉన్న స్పందించే కర్తవ్యం కలిగిన వ్యక్తులు పాత్రికేయులు. పాత్రికేయులకు టీ వై జె ఎఫ్ యూనియన్ ఐడి కార్డు పంపిణీ, హెల్త్ కార్డుల పంపిణీ, పత్రికా విలేకరుల పిల్లల చదువుల కోసం ప్రైవేట్ పాఠశాలలో ఉచితంగా విద్యను అభ్యసించడం కోసం సంగారెడ్డి జిల్లా డిఇఓ రోహిణి జారీ చేయడం చాలా శుభ పరిణామంగా భావిస్తూ టీ వై జె ఎఫ్ యూనియన్ నన్ను ఆహ్వానించి సత్కరించారు ప్రత్యేక ధన్యవాదాలు మైనార్టీ నాయకుడు నజీర్ అన్నారు.

# ఫ్యాన్స్ కు పూనకాలే!

## పవన్ కల్యాణ్ కు 'ఓజీ2' కథ చెప్పిన సుజీత్..




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సీక్వెల్‌పై కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఓజీ2 కోసం ప్రీ-ప్రొడక్షన్ చర్చలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. దర్శకుడు సుజీత్... పవన్ కు ఓజీ2 కథ వినిపించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేసింది. ఇచ్చిన మాట ప్రకారం చర్చలు మొదలయ్యాయని, దర్శకుడు సుజీత్ ... పవన్ తో సమావేశంలో పాల్గొన్నారని వెల్లడించింది.
సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ క్రైమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'దే కాల్ హిమ్ ఓజీ' (2025) చిత్రంపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విజన్ తనకు ఎంతగానో నచ్చిందని, దీనిని ఒక యూనివర్స్‌గా (సీక్వెల్స్, ప్రీక్వెల్స్) విస్తరించే ఆలోచన ఉందని పవన్ కళ్యాణ్ గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతుండటంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం క్రియేటివ్ వర్క్స్ కార్యాలయంలో దర్శకుడు సుజీత్, పవన్ మధ్య చర్చలు జరగడం ఓజీ2 ప్రాజెక్ట్‌పై కదలిక మొదలైందనడానికి సంకేతంగా నిలుస్తోంది.
ఈ వార్త తెలియగానే పవన్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు.
ఓజీ2 హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు, మీమ్స్ ట్రెండ్ అవుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# అనిల్ రావిపూడి రక్తంతో విజయ తిలకం దిద్దిన టీం...

## దర్శకుడి రక్తంతో విజయతిలకం దిద్దుతూ ఫన్నీ వీడియో విడుదల




విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న భారీ మల్టీస్టారర్‌కు సంబంధించిన ప్రమోషన్లు వినూత్నంగా మొదలయ్యాయి. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభానికి ఒక రోజు ముందు, చిత్ర యూనిట్ 'కత్తిలాంటి ఐడియా' పేరుతో ఒక సరదా వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.
షైన్ స్క్రీన్స్ నిర్మాణ సంస్థ షేర్ చేసిన ఈ ప్రమోషనల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ఒక కత్తి పట్టుకుని, "ఎప్పుడూ ఐడియాలు నేనే ఇవ్వాలా" అంటూ సరదాగా అసహనం వ్యక్తం చేస్తారు. వెంటనే వెంకటేష్ ఆయన చేతిని కత్తితో సరదాగా కోసి, ఆ రక్తంతో విజయ తిలకం దిద్దుతారు. ఆ తర్వాత కల్యాణ్ రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా అదే అనుసరించడంతో అనిల్ రావిపూడి ఫన్నీగా స్పందిస్తారు. రాయలసీమ నేపథ్యం అనగానే ఫ్యాక్షన్ అనుకోవద్దని, ఇది పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని ఆయన ఈ వీడియో ద్వారా స్పష్టం చేశారు.
ఈ సినిమా జూన్ 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఇటీవలే హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ లాంఛనంగా ప్రారంభమైంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సౌత్ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తన సినిమాలకు విభిన్నంగా ప్రచారం చేయడంలో పేరున్న అనిల్ రావిపూడి, ఈసారి కూడా అదే శైలిని కొనసాగించారు.

# శ్రుతి క్లారిటీతో కొత్త సస్పెన్స్ స్టార్ట్!

సౌత్ సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రాజెక్టుల్లో డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించనున్న రజినీకాంత్– కమల్ హాసన్ మల్టీస్టారర్ ఒకటి. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. సినిమా ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, దీనికి సంబంధించిన ప్రతి చిన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి ఎక్కువగా వినిపించిన పేరు శృతి హాసన్‌ది. కమల్ హాసన్ కూతురు కావడంతో పాటూ, రజినీకాంత్ హీరోగా వచ్చిన కూలీ సినిమాలో ఆమె ఇప్పటికే నటించడం వల్ల ఈ కొత్త మల్టీస్టారర్‌లో కూడా ఆమె నటించే అవకాశాలున్నాయనే ప్రచారం జోరుగా సాగింది. ముఖ్యంగా రజినీ– కమల్ వంటి ఇద్దరు దిగ్గజాలు కలిసి నటిస్తున్న సినిమాలో శృతి హాసన్ ఉంటే ఆ వార్తకు మరింత ప్రత్యేకత వస్తుందని అభిమానులు భావించారు. అయితే ఈ ఊహాగానాలకు తాజాగా శృతి హాసన్ స్వయంగా చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో తాను భాగం కాలేదని ఆమె స్పష్టం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న రూమర్స్‌కు ఫుల్ స్టాప్ పడినట్టే కనిపిస్తోంది. కానీ శృతి పేరు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదే హీరోయిన్ కాస్టింగ్. ఇద్దరు లెజెండరీ స్టార్లు ప్రధాన పాత్రల్లో కనిపించనున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారు? అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. కథలో హీరోయిన్ పాత్ర ఎంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది? సీనియర్ స్టార్ హీరోయిన్‌ను తీసుకుంటారా? లేక పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త ఎంపిక వైపు వెళ్తారా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇక డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు కూడా చర్చనీయాంశంగా మారింది. జైలర్ తర్వాత తన ప్రాజెక్టుల విషయంలో నెల్సన్ ఎక్కువ సీక్రసీ మెయింటైన్ చేస్తున్న సంగతి తెలిసిందే. నటీనటుల ఎంపిక నుంచి కథకు సంబంధించిన కీలక అంశాల వరకు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేంత వరకు ఎలాంటి సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ మల్టీస్టారర్ విషయంలో కూడా అదే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'మా ఇంటి బంగారం'.. రెండు రోజుల్లో ఎంత కొల్లగొట్టిందంటే..!




స్టార్ నటి సమంత ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. 'ఓ బేబీ' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత దర్శకురాలు నందిని రెడ్డి, సమంత కాంబినేషన్‌లో వచ్చిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 19న (శుక్రవారం) విడుదలైన ఈ సినిమా, మొదటి ఆట నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది.విడుదలైన మొదటి రోజే రూ. 13 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన 'మా ఇంటి బంగారం', రెండో రోజు శనివారం కూడా తన జోరును కొనసాగించింది. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత పెరిగాయి. శనివారం ఒక్కరోజే రూ. 15 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, మొదటి రోజును మించిన వృద్ధిని కనబరిచింది. దీంతో రెండు రోజులకు కలిపి సినిమా మొత్తం రూ. 28 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.సినిమాకు వచ్చిన మంచి టాక్, సమంత నటనకు తోడు వారాంతం కావడంతో ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఇక, ఈరోజు (ఆదివారం) కూడా సెలవు దినం కావడంతో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# యశ్ 'టాక్సిక్' కొత్త రిలీజ్ డేట్ వచ్చేసింది.. పండగల సీజన్‌లో భారీగా విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదల తేదీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ సినిమాను ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గత కొద్ది రోజులుగా ఈ సినిమా ఆగిపోయిందంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో మేకర్స్ చెక్ పెట్టారు.నేడు చిత్ర నిర్మాతలు సరికొత్త పోస్టర్‌తో పాటు విడుదల తేదీని వెల్లడించారు. ఈ పోస్టర్‌లో యశ్ 'రాయ', 'టికెట్' అనే రెండు విభిన్నమైన, పవర్‌ఫుల్ అవతారాల్లో కనిపించి ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తించారు. ఇది కేవలం తండ్రీకొడుకుల కథ మాత్రమే కాదని, వారి మధ్య ఉన్న ఉద్రిక్తత, అధికారం, సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని పోస్టర్ సూచిస్తోంది.
ఈ సినిమా విడుదల తేదీని వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. 2026 ఆగస్టు చివరి వారంలో వరలక్ష్మీ వ్రతం, ఓనం, ఈద్, రక్షాబంధన్ వంటి వరుస పండగలు రానున్నాయి. ఈ సెలవులను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా వారాంతానికి ముందే సినిమాను విడుదల చేస్తున్నారు. దీనివల్ల దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో భారీ ఓపెనింగ్స్ సాధించవచ్చని చిత్రవర్గాలు భావిస్తున్నాయి.నిజానికి ఈ చిత్రాన్ని మొదట మార్చి 19న, ఆ తర్వాత జూన్ 4న విడుదల చేయాలని భావించారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల




చేయాలనే ప్రణాళికతో పాటు, అంతర్జాతీయ డిస్ట్రిబ్యూషన్ భాగస్వామ్యాల కోసం విడుదల తేదీని వాయిదా వేస్తూ వచ్చారు.
విలక్షణ చిత్రాల దర్శకురాలు గీతూ మోహన్‌దాస్, రాకింగ్ స్టార్ యశ్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా వంటి ప్రముఖ తారలు నటిస్తున్నారు. కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.



# ట్రోల్స్ నుంచి టాప్ లైనప్ వరకు!

టాలీవుడ్‌లో యంగ్ హీరోల మధ్య పోటీ రోజురోజుకీ పెరుగుతున్న సమయంలో, తన కెరీర్‌ను కొత్త దిశలో తీసుకెళ్తున్న నటుడు కిరణ్ అబ్బవరం. ఒకప్పుడు వరుస ఫ్లాప్‌లు, సోషల్ మీడియా ట్రోల్స్, మార్కెట్‌పై అనుమానాల మధ్య ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ యంగ్ హీరో, ఇప్పుడు మాత్రం పూర్తిగా భిన్నమైన పరిస్థితిని ఆస్వాదిస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా నిలిచింది మాత్రం క సినిమానే. ఈ సినిమా రిలీజ్ కు ముందు కిరణ్ అబ్బవరం కెరీర్‌పై అనేక ప్రశ్నలు వినిపించాయి. వరుస సినిమాలు ఆశించిన ఫలితాలు అందుకోకపోవడంతో ఆయన ఫ్యూచర్ కెరీర్ పై సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే క సినిమా కేవలం కమర్షియల్ సక్సెస్‌నే కాదు, కిరణ్‌పై ఇండస్ట్రీలో ఉన్న అభిప్రాయాన్ని కూడా మార్చేసింది. ముఖ్యంగా కథల ఎంపికలో కొత్త దృక్పథాన్ని చూపించగలడనే నమ్మకాన్ని ఈ సినిమా తీసుకొచ్చింది. అదే సమయంలో కిరణ్‌లో కూడా ఆ సినిమా కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది ఈ సక్సెస్ తో కిరణ్ అబ్బవరం ఆగకుండా తన కెరీర్‌ను విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. హీరోగా సినిమాలు చేయడమే కాకుండా, నిర్మాతగా మరియు డైరెక్టర్ గా కూడా తన సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న రియాలిటీ ప్రాజెక్ట్ ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక నటుడు స్వయంగా కథపై నమ్మకంతో మెగాఫోన్ పట్టడమనేది చిన్న విషయం కాదు. దీంతో కిరణ్ తనపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలంగా చాటుతున్నారని చెప్పాలి.అదే సమయంలో నిర్మాతగా కూడా ఆయన కొత్త ప్లాన్స్ రూపొందిస్తున్నారు. ఒకవైపు చెన్నై లవ్ స్టోరీ రిలీజ్ కు సిద్ధమవుతుండగా, మరోవైపు క2 స్క్రిప్ట్ పనులు వేగంగా సాగుతున్నాయి. క ఇచ్చిన సక్సెస్ ఆ ఫ్రాంచైజీ స్థాయికి తీసుకెళ్లాలనే ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు, సుకుమార్ రైటింగ్స్‌లో రూపొందబోయే కొత్త ప్రాజెక్ట్ కూడా కిరణ్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా భావిస్తున్నారు. సినిమాలతో పాటు ఓటీటీ రంగంలో కూడా కిరణ్ అడుగులు వేస్తున్నారు. డియర్ కామ్రేడ్ ఫేమ్ భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గువ్వల చెరువు ఘాట్ వెబ్ సిరీస్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అలాగే కాంతార టీమ్‌కు చెందిన శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వంలో రూపొందనున్న మిస్టికల్ థ్రిల్లర్ ఆయన తొలి పాన్ ఇండియా ప్రయత్నంగా నిలవనుంది. ఒకప్పుడు ట్రోల్స్‌కు టార్గెట్ అయిన కిరణ్ అబ్బవరం, ఇప్పుడు తన లైనప్‌తోనే చర్చనీయాంశంగా మారడం విశేషం. హీరోగా మాత్రమే కాకుండా డైరెక్టర్, ప్రొడ్యూసర్, ఓటీటీ యాక్టర్, పాన్ ఇండియా హీరోగా విభిన్న మార్గాల్లో ముందుకు సాగుతున్న ఆయన ప్రయాణం చూస్తుంటే, క సినిమా నిజంగానే ఆయన కెరీర్‌ను పూర్తిగా మార్చేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడు ఈ భారీ ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయగలిగితే, యంగ్ హీరోల రేసులో కిరణ్ అబ్బవరం మరింత బలమైన స్థానాన్ని సంపాదించే అవకాశం కనిపిస్తోంది.

# గురు రాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం

**యోగాతో మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం: డాక్టర్ దస్తగిరి రెడ్డి..**



**నంద్యాల జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల జిల్లాలోని బాబా నగర్ సమీపంలో గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో లోని క్రీడామైదానంలో యోగా దినోత్సవం వేడుకలు పాఠశాల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా కార్యక్రమానికి శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పి. దస్తగిరి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యం కలుగుతుందని గుర్తు చేశారు. ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో యోగ ఆసనాలు చేసేవారిని గుర్తు చేశారు. మన భారతదేశం నుండి ప్రపంచ స్థాయికి యోగ ఎంతో ప్రాచుర్యం చెందిందని అన్నారు. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి చెందుతుందని తెలిపారు. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరు యోగాసనాలు చేయడం అలవాటుగా మార్చుకోవాలని అన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలి

**యువశక్తి దేశాభివృద్ధికి పునాది - మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల బ్యూరో, జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమం అనంతరం, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న "నశా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తున్న ఈగల్ టీమ్ సేవలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో సిగరెట్, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంతో పాటు మొబైల్ ఫోన్‌లకు అతిగా అలవాటు పడటం, అనవసరమైన వీడియోలు మరియు సోషల్ మీడియా కంటెంట్‌ను అధికంగా వీక్షించడం వంటి చెడు అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. ఇటువంటి వ్యసనాలు వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా దుష్ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత స్నేహితుల ప్రభావంతో తెలియకుండానే ఇలాంటి అలవాట్లకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తి జీవితాన్ని, కుటుంబాన్ని, భవిష్యత్తును నాశనం చేసే వ్యసనాలకు దూరంగా ఉండటం అత్యంత అవసరమని ఆమె అన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవడం, సానుకూల ఆలోచనలు పెంపొందించుకోవడం, విద్య, క్రీడలు, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాల వైపు దృష్టి సారించడం ద్వారా యువత తమ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని సూచించారు. వ్యసనాలకు గురవుతున్న వారిని గుర్తించి వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందించడం, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించేందుకు ఈగల్ టీమ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వ్యసనాల వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా సమాజం కూడా కలుషితం అవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో యువతతో కలిసి మత్తుపదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడం సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత "నశాముక్త్ భారత్ అభియాన్" కింద మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని, తమ జీవితాల్లో ఎటువంటి మత్తు పదార్థాలకు తావివ్వబోమని, కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా ఈ దిశగా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. దేశాభివృద్ధికి యువశక్తి కీలకమని, మార్పు మన నుంచే ప్రారంభం కావాలని, అందరూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా, భారతదేశాన్ని వ్యసనరహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు.

# జూన్ 22న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**నంద్యాల బ్యూరో, జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):**



జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో జూన్ 22వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# యోగాంధ్ర-2026కు నంద్యాల జిల్లా ప్రజల అపూర్వ స్పందన

**జిల్లావ్యాప్తంగా 4,700 కేంద్రాల్లో సుమారు 4 లక్షల మంది భాగస్వామ్యం**

**యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**








**నంద్యాల బ్యూరో, జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** యోగం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో యోగాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలను సమిష్టిగా నిర్వహిస్తూ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో గత 14 రోజులుగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించినట్లు తెలిపారు. వృత్తిపరమైన మరియు వ్యక్తిగత జీవితాల్లో సమతుల్యత సాధించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. శ్రీశైలం, మహానంది వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లో నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమాల్లో ఒక్కో చోట దాదాపు రెండు వేల మంది చొప్పున పాల్గొనడం విశేషమన్నారు. యోగా అసోసియేషన్ల సహకారంతో నిర్వహించిన థీమాటిక్ యోగా కార్యక్రమాలు కూడా ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,700 కేంద్రాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో సుమారు 4 లక్షల మంది ప్రజలు భాగస్వాములై యోగాపై తమ ఆసక్తిని చాటుకున్నారని వెల్లడించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని కలెక్టర్ పేర్కొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు యోగాను ఆచరిస్తున్నాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ "యోగ ఫర్ హెల్దీ ఏజింగ్" కావడంతో ప్రతి ఒక్కరూ తమ వయస్సు, శారీరక పరిస్థితులకు అనుగుణంగా యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువత తప్పనిసరిగా యోగా సాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తి, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అసెంబ్లీ సమయంలో యోగా నిర్వహిస్తున్నామని, ఇదే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ప్రతిరోజూ యోగా సాధనకు సమయం కేటాయించాలని కోరారు. యోగా ద్వారా విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యుత్తమ సంపదలలో ఒకటని పేర్కొన్నారు. జీవితంలో ఎన్నో పరధ్యానాలు ఉన్నప్పటికీ యోగా మనలోని శక్తిని లక్ష్యసాధన వైపు కేంద్రీకరించగలదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రోజుకు 20 నుండి 30 నిమిషాలు యోగా సాధన చేస్తే తమ లక్ష్యాలను మరింత సులభంగా సాధించగలరని చెప్పారు. నిత్యం బిజీ జీవితాన్ని గడిపే ఉద్యోగులు, అధికారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం, సాయంత్రం లేదా కార్యాలయాల్లో లభించే కొద్ది సమయాన్ని కూడా యోగా సాధనకు వినియోగించుకోవచ్చని సూచించారు. యోగా ఒక రోజు కార్యక్రమంగా కాకుండా జీవితాంతం కొనసాగించే ఆరోగ్యకరమైన అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కనీసం మరో ఐదుగురికి యోగా ప్రాముఖ్యతను వివరించి వారిని కూడా యోగా వైపు ప్రోత్సహించాలని కోరారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే యోగాంధ్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయుష్ యోగా తెరపిస్ట్ మయూరాసనం, శిరశాసనం, సర్వాంగాసనం, చక్రాసనం, బకాసనం వంటి యోగాసనాలను వేసి ప్రాముఖ్యతను వివరించారు. పాణ్యం మండలం విద్యార్థులు సమన్వయ యోగా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. యోగాంధ్ర-2026 విజయవంతానికి సహకరించిన ఆకాంక్ష యోగా సమితి, అమర యోగ వికాస కేంద్రం, ఇషా ఫౌండేషన్, హార్ట్‌ఫుల్‌నెస్, నేచురోపతి అండ్ యోగా సంస్థలు, ప్రజాపిత బ్రహ్మకుమారీస్, శ్రీ సత్యసాయి ధ్యాన మండలి, స్పోర్ట్స్ యోగాసన అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. అలాగే 14 రోజులపాటు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, క్రీడా అభివృద్ధి శాఖ, పోలీసు శాఖ, సివిల్ సప్లైస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి, జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌లో ప్రకృతి, ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రశంసలు







**నంద్యాల బ్యూరో, జూన్ 21 (రిపబ్లిక్ న్యూస్):** ప్రకృతితో మమేకమై, ఆధ్యాత్మికతను అలవర్చుకుని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణం క్రాంతి నగర్ లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పర్యావరణహిత విధానాలు, ధ్యాన సాధన, ప్రకృతి సంరక్షణ చర్యలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థలో అమలు చేస్తున్న దశ నియమాలు, ముఖ్యంగా ఉదయాన్నే లేవడం, హృదయాన్ని ప్రేమతో నింపుకోవడం, ఆధ్యాత్మికత ద్వారా భగవంతునికి చేరువ కావడం వంటి అంశాలు జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రకృతిలో ఏదీ వ్యర్థం కాదని, ప్రతి అంశం మనకు ఒక పాఠాన్ని నేర్పుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక మొక్క నుంచి మరొక మొక్కను సృష్టించడం, నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, వినియోగించిన నీటిని తిరిగి వంట అవసరాలకు, మొక్కల పెంపకానికి ఉపయోగించడం వంటి రీసైక్లింగ్ విధానాలను సంస్థలో సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే రాలిన ఆకులతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి తిరిగి వ్యవసాయ అవసరాలకు వినియోగించడం ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రస్తుత కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు తగ్గిపోవడంతో ఒంటరితనం పెరుగుతోందని, చాలా మంది తమ సమస్యలను ఇతరులతో పంచుకోకపోవడం వల్ల మానసిక, శారీరక అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హార్ట్‌ఫుల్‌నెస్ వంటి సంస్థలు సమాజానికి ఒక మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని అన్నారు. ఇక్కడ అందరితో కలిసిమెలిసి ఉండడం, ప్రకృతిలో సమయం గడపడం, పుస్తకాలు చదవడం, ధ్యానం చేయడం ద్వారా జీవనశైలి సానుకూలంగా మారి ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందని వివరించారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవంతో, ఆప్యాయతతో మెలిగే వాతావరణం ఇక్కడ కనిపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని శాంతివనం (కన్హా ఫౌండేషన్)ను సందర్శించిన సందర్భంగా అక్కడ అమలు చేస్తున్న "నెట్ జీరో" భావన, ప్రకృతితో అనుసంధానమైన జీవన విధానం ఎంతో ఆకట్టుకున్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ ఆలోచనలను పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులకు పరిచయం చేసి, వారి ద్వారా కుటుంబాలకు విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో పెంచేందుకు డీపీఆర్ఎస్ ద్వారా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, గ్రిడ్ మోడల్, బ్లాక్ ప్లాంటేషన్ వంటి ఆధునిక విధానాలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో ప్లాంటేషన్ కార్యక్రమాలతో పాటు కంపోస్టింగ్, ఇంకుడు గుంతల ద్వారా నీటి సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్) వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత అభివృద్ధికి తోడ్పడేందుకు సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను మొదటి విడతగా జిల్లాలోని సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాలు, జ్యోతిబా పూలే, అంబేద్కర్ గురుకులాలు తదితర మొత్తం 56 పాఠశాలల్లో అమలు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలులో హార్ట్‌ఫుల్‌నెస్ బృందం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. తక్కువ సమయంలో సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించడం, ప్రతి సమావేశంలో పాల్గొని మార్గనిర్దేశం చేయడం ద్వారా జిల్లాలో పర్యావరణ చైతన్య కార్యక్రమాలకు విశేషంగా తోడ్పడుతున్నందుకు జిల్లా యంత్రాంగం తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్న పిల్లల నుంచే ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత పెంపొందించేలా వారు స్వయంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే అలవాటును పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ అని, భగవద్గీత సందేశం ప్రకారం ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒకటి నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. సందర్శనలో భాగంగా కొద్దిసేపు చేసిన ధ్యానం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను అందించిందని కలెక్టర్ తెలిపారు. నిరంతరం పని ఒత్తిడిలో ఉండే అధికారులు, ఉద్యోగులకు ధ్యానం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా యంత్రాంగం తరపున హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆవరణలో మామిడి మొక్కను నాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com